"తప్పుకోండయ్యా...బాబూ... అమ్మా... దారి యివ్వండి. అలా మమ్మల్ని వెళ్ళనివ్వండి..." గట్టిగా అంటూ, దారిచేసుకొంటూ రైలు ఎక్కుతున్న పురుషోత్తమ్‌ను అందరూ పట్టి చూడడం సరోజకు సిగ్గనిపించింది.

'పల్లెటూరి బైతులా అరుస్తూ రైలెక్కాలా... అదీ అందరూ వింతగా చూచేటంత యిదిగా' భర్తమీద ఒక్కసారి అసహ్యం వేసింది.




# దివ్యమంగళ విగ్రహం

— సూరజ్ ప్రసాద్

రిజర్వేషన్ కంపార్ట్‌మెంటయినా రద్దీగా ఉంది. భర్త అడుగులో అడుగులేసుకుంటూ సీట్లు వెతుక్కునేసరికి సరోజకు తల ప్రాణం తోకకొచ్చింది. కిటికీ ప్రక్కగా తన సీటు, ప్రక్క భర్తసీటు. భర్తతో యీ రైలు ప్రయాణం మెయిడెన్ ఎక్స్‌పీరియన్స్. తల్లిదండ్రులు లేకుండా తన మొదటి ప్రయాణం.

అప్పటికి పెళ్ళయి సరిగ్గా నెల రోజులు. 'నెల రోజుల క్రితం తనెవరో... అతనెవరో... ఏడడుగులు వేయించారు. కొంగూ కొంగూ ముడివేస్తూ తమ యిరువురి జీవితాలూ ముడివేసేశారు' పెద్దలు. ఇక జీవితమంతా తను అతని చేయిపట్టుకొనే నడవాలి....'

"ఏమిటోయ్ సరోజా... పగటి కలలు కంటు న్నావ్ అప్పుడే-పిల్లాపాప గురించా" భర్త పలకరింపుతో ఉలిక్కి

పడింది. బుగ్గల్లో రోజాలు...

"ఛీ...పోండి... రైలు కంపార్టుమెంటనయినా ఆలో చించకుండా ఏమిటా మాటలు. చూడండి... అంతా ఎలా చూస్తున్నారో."

"చూడనీయవోయ్, క్రొత్తగా పెళ్ళయిన దంపతు లని గుర్తిస్తారు. అదీ... హనీమూన్‌కని బయలు దేరారని ఆరా తీస్తారు. అది సరే... సామానంతా వచ్చిందో... లేదో సరిచూచుకున్నావా?"

సామాన్లన్ని లెక్కచూచి సర్దుకొంటూ ముందుసీటు వైపు చూచేసరికి... ఎదుటి వ్యక్తి చూపులు సరోజ చూపుల్లో చిక్కుకుపోయాయి. వెంటనే తల త్రిప్పేసు కుంది. మరచిపోదామన్నా మరిచిపోలేని అతని రూపం... కిటికీవైపు చూస్తూ ఓసారి... కిటికీలోంచి చూస్తున్నట్లే చూస్తూ కనుకొలకుల్లో నుంచి ఓసారి... భర్తవైపు తలత్రిప్పుతూ మరోసారి... కిటికీవైపు చూస్తూ మరొక్కసారి... అలా చూసీ చూడనట్లు చూస్తూనే... సరోజ కళ్ళు అతని రూపాన్ని ఫ్లాష్‌తో క్లిక్ చేశాయి. క్రమంగా సరోజ హృదయం ఫోటో పేపర్‌పై అతని రూపం స్పష్టంగా కన్పించడం మొదలు పెట్టింది.

'అబ్బ! ఎంత అందంగా ఉన్నాడు! ఆ వంపులు తిరిగిన గిరజాల జుట్టు... ఆ విశాల ఫాలభాగం మీద... అలా... అలా కొన్ని ముంగురులు జీరాడుతూ... నల్లని కనుబొమలు... విశాలనేత్రాలు, పచ్చని పసిడి ముఖానికి తగ్గ లేత గులాబీ పెదవులు, సన్నని మీసకట్టు పెదవుల మధ్య అందంగా కాలుతోన్న ఖరీదైన సిగరెట్టు ... అదీ... తనకిష్టమైన భంగిమలో కాలుస్తూ గ్రే పేంట్‌లో తెల్లటి పాలిస్టర్ షర్ట్ టకప్... కాళ్ళకు అంబాసిడర్ షూ...'

ధైర్యంచేసి అతన్ని చూసింది. అతను బయటకు ఎటోచూస్తూ... సిగరెట్‌ను ఎంజాయ్ చేస్తూన్న తన్మ యత్వం... కొద్దిక్షణాలు అతని ముఖంమీద ఆమె చూపులు కేంద్రీకరించబడ్డాయి. ట్రైన్ వేగం హెచ్చింది. మొదట్లో మనస్సులో వినిపించిన తప్పెట్ల చప్పుడు... సన్నగా తబలా వరుసలలో పై కాలంలో వినిపించడం మొదలెట్టింది.

"సరోజా... యిదిగో... యీ బత్తాయి తొనలు తీసుకో..."

సరోజ ఏకాగ్రత చెదిరిపోయింది. భర్తవైపు చురుగ్గా చూచింది.

ఆముదం రాసినా అణగని జుట్టు... అందులో సమ్మర్‌కాఫ్... చిన్న గుంటకళ్ళు... ఛాయతో పోటీ పడుతూ బారులు తీరినట్లున్న తుమ్మెదల్లాంటి మీసాలు... గడ్డంమీద చిన్నప్పటి గుంట... డార్క్ కలర్ పేంట్... షర్ట్... కాళ్ళకు స్లిప్పర్లు...

సరోజ మనసు బాధగా మూల్గింది.'యీ అందగాడి తోనే తను కాపరం చేయబోయేది....'

"తీసుకో సరోజా... చాలా బావున్నాయి"

"అబ్బ... నాకిప్పుడేమీ వద్దండి. తలనెప్పిగా ఉంది"

"తలనెప్పిగా ఉందా... అయితే అమృతాంజనం తీయనా?"

"వద్దులెండి... నన్నిలా ఉండనివ్వండి... కాసేపు మీరు మాట్లాడకుండా ఉంటే చాలు... అదే తగ్గి పోతుంది."

వెయ్యిపీయి

# సరస సంబోధనం

"[illegible]
[illegible]
[illegible]
[illegible]"

భండారు పర్వతాలరావు

"అయితే అలా కిటికీకి చేరగిలబడు."

సరోజ కళ్ళు మూసుకొంది...

కొద్ది క్షణాలు...,

"ఎక్స్‌క్యూజ్ మీ..."

సరోజ కళ్ళు తెరిచింది... ఎదుటి సీటువ్యక్తి. 'మనిషే కాదు... మాటకూడా మధురంగా ఉంది'.

"ఆ ఇలస్ట్రేటెడ్ వీక్లీ యిలా యిస్తారా"

మౌనంగా అందించింది. కావాలని చేతి వేళ్ళు తగిలించాడు. షాక్ తగిలినట్లయింది. అతను తనవైపే చూస్తున్నాడు. చూపులు మరల్చుకుంది. మెల్లగా షూ విప్పి వీక్లీ చదవడంలో మునిగిపోయాడు.

మళ్ళీ కళ్ళుమూసుకొంది. ట్రైన్ ఏదో బ్రిడ్జిమీద పోతున్నట్టుంది. లయబద్ధంగా శబ్దం వినిపిస్తోంది... మనసుకెంతో హాయిగా ఉంది. మెల్లగా పాదానికేదో చల్లగా తగిలితే చూస్తే... అతని పాదం... తన పాదాన్ని మృదువుగా స్పర్శిస్తూ... ఎందుకో వెనుకకు తీయాలని పించలేదు... కళ్ళు మూసుకొంది...

ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్... ఏకాంతంలో తనూ... అతనూ..

"డియర్"

"ఊ"

"ఆ సిగరెట్ త్రాగే నీ పోజ్ ఎంత అందంగా ఉంటుందో!"

"నీకంటేనా?"

"నీ పెదవులెంత ఎఱ్ఱగా ఉన్నాయో డియర్!"

"ఆ ఎరుపు నీకూ కావాలా! నీ అందుబాటులోనే ఉన్నాయి!"

"ఎంత విశాలమైన నుదురు..."

"నీ గురించిన ఆలోచనలు అంతటి నుదుటిలో కూడా యిమడలేకపోతున్నాయి."

"నీ కళ్ళల్లోకి చూస్తూ యిలా కాలం గడిపి వేయా లనిపిస్తోంది డియర్".

"యిక కాలమంతా మనదే... సరూ."

తన కుడి చేతి వ్రేళ్ళు అతని వంకీల జుట్టుతో ఆడు కొంటున్నాయి. ఎడమచేతి చూపుడు వ్రేలు అతని సన్నని మీసాన్ని మృదువుగా సవరిస్తోంది.

అతని చేతులు తన మెత్తని గుండెలపై... తనను నిలువెల్లా పెనవేసి... ఒకే బెర్త్‌పై... కాలం స్తంభి స్తోంది.

కదిలే రైలు ఆగిపోయింది. ఏదో స్టేషన్ వచ్చి నట్లు ంది. అతను గబగబా దిగుతున్నాడు. ఎవరో ఆడవాళ్ళు ఎక్కుతున్నారు. వాళ్ళను ఒరుసుకుంటూ దిగడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఒక్కసారి తనను తను చూచుకొంది. తనూ అందగత్తే. తీర్చిదిద్దిన కనుబొమ్మలూ, రోజాలను ధిక్క రించే బుగ్గలూ... పెదవులూ... చెంపకు చారెడు కళ్ళూ... తను ముందుకు వేసుకొన్న జడ ఎత్తైన గుండెల మీదుగా... తనుకూడా అతన్ని ఆకర్షించడంలో గొప్పలేదూ? అందుకనే పుస్తకం అడిగాడు. బామ్మ మెటికలు విరుచుకుంటూ అంటుండేది 'తల్లీ...నీకు మన్మధుని వంటి భర్త దొరుకుతాడని'. భర్త ఏదో నవలలో లీనమైనట్లున్నాడు... ఒట్టి పుస్తకాల పురుగు.

ట్రెయిన్ కదిలింది. సరోజ మనసు బాధగా మూల్గింది, అతను అప్పుడే దిగిపోయినందుకు... ఆశ్చర్యం... అతను మరో డోర్‌నుండి కంపార్ట్‌మెంట్ లోకి వచ్చేశాడు.

సరోజ నిద్రపోతున్నట్లు నటిస్తోంది. భర్త అతనితో సంభాషణ మొదలుపెట్టాడు.

"హై...ది...హై... మీ పేరు చెప్పారు కాదు."

"మన్మథరావు."

"ఏం చేస్తుంటారు?"

"మెడికల్ రిప్రెజెంటేటివ్‌గా పని చేస్తున్నాను."

"ఇంకా బాచులరేనా?"

"బాచులర్‌గా ఉంటే ఉన్న థ్రిల్ పెళ్ళయ్యాక ఉండదు సుమండీ... నామటుకు నాకు ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోవాలనిపిస్తోంది."

"అదేం పాపం!!"

"పాపం అంటారేమిటండీ... అందులో ఎంత సుఖం! పెళ్ళాం, పిల్లలు ఉండరు... విలాసంగా గడిపేయవచ్చు. అన్నట్లు... మీ పేరు..."

"పురుషోత్తమ్"

"ఎందాకా?"

చెప్పాడు.

"హనీమూన్‌కు బయలుదేరినట్లున్నారే?"

మౌనం... అతను సిగరెట్ ఆఫర్ చేసినట్లున్నాడు.

"నో... థాంక్స్! సిగరెట్ అసలు యింతవరకూ ముట్టుకోలేదు."

"భలేవారే... పొగత్రాగని వాడు దున్నపోతై పుట్టున్ అన్నాడు గిరీశం."

"ఎవరేమన్నాసరే... రాబోయే జన్మ ఎటువంటి దైనా నేను మాత్రం సిగరెట్ యీ జన్మలో త్రాగదల్చు కోలేదు."

"సిగరెట్ త్రాగితే ఉండే మజా మీకేం తెలుస్తుంది లెండి!"

"మీరెన్నయినా చెప్పండి. అసలు వ్యాధులన్నింటికీ సిగరెట్ కారణమన్నారు డాక్టర్లు... " యిక లెక్చర్ దంచబోయేటట్లున్నాడు. తను చెడింది కాక అతన్ని కూడా ఎందుకు చెడగొట్టడం?

సరోజ అసహనంగా కదిలింది. కళ్ళుమూసుకొనే ఉంది.

మొదటి రాత్రి...

పాలగ్లాసుతో లోపలకు అడుగుపెట్టిన తన ఊహకు విరుద్ధంగా...

'బాల్కనీలో... వెన్నెట్లో నాలు కుర్చీలో పడు

కొని... ఏవేవో కవితలల్లుతూ... సిల్కు లాల్చీలో... పంచెలో... సిగరెట్ త్రాగుతూ... తన్మయావస్థలో భర్త ఉంటే... తను సుస్మితంగా అతన్ని తట్టి లేపాల్సింది...'

తినుబండారాలను ఓ పట్టు పట్టేస్తున్న భర్త తన రాకను సైతం గమనించని స్థితిలో తట్టితే...

"పాలు తెచ్చావా...త్వరగా యివ్వు... దాహంగా ఉంది."

తన ఉత్సాహాన్నే గటగటా త్రాగేశాడు.

టేబిల్ మీద దృష్టి పడిందేమో..ఎదురుగా ఖరీదైన సిగరెట్ పెట్టె..అగ్గిపెట్టె.

తను ప్రత్యేకంగా తమ్ముడికి డబ్బుయిచ్చి తెప్పించింది..బావగారు అడుగుతారని.

"ఛీ..ఛీ..దీన్నెవరు యిక్కడ పెట్టింది. దాన్ని చూస్తేనే నాకు కంపరం. ముందు తీసి అవతల పడెయ్యి సరోజా..తీసెయ్యి.."

తనేమీ మాట్లాడలేదు.

ఆఖరికి అతనే సిగరెట్ పెట్టె కిటికీలోనుంచి బయటకు విసరేశాడు.

తనను దగ్గరకు తీసుకుంటూ "మైడియర్ సరోజా.. ఆరోగ్యానికి భంగం కలిగించే అలవాట్లెప్పుడూ మన దగ్గరకు రాకూడదు. సిగరెట్..మద్యం..మగువా.. నువ్వు తప్ప..ఏమంటావు. అంతే కదూ...."

తనేమనగలుగుతుంది. కిటికీలోంచి చూస్తే చంద మామ కూడా తన ఆశకు చిరునవ్వు నవ్వుతున్నట్లని పించింది.

"పురుషోత్తమ్‌గారూ .. కొద్దిగా మంచినీళ్ళిప్పిస్తారా..?"

ఎదుటి వ్యక్తి పిలుపుతో యిహంలోకి వచ్చేసింది.

తనే గ్లాసుతో మంచినీళ్ళు భర్త కందించింది. భర్త అతనికి..

గ్లాసు నీళ్ళల్లోకి కొద్దిగా సీసాలోది వంపుకుని గటగటా త్రాగేశాడు.

"మీరు పుచ్చుకున్నది.." భర్త గొంతులో ఆశ్చర్యార్థకం.

"మందు."

"కంపార్ట్‌మెంట్‌లో..తప్పకదూ?"

"చూడండి. పురుషోత్తమ్‌గారూ..అన్ని జన్మలలోకీ మానవ జన్మ ఉత్తమమైనది. అందులోనూ యవ్వనం ఉత్కృష్టమైంది. అటువంటి యవ్వనాన్ని వృథాగా గడిపేస్తే జీవితం చెరకు పిప్పే. అందుకనే అందినంత వరకూ అన్నీ అనుభవించాలి.'కామిగాని మోక్ష గామి కాదు' అని వేమన ఊరికే అన్నాడా?"

"మదిర..మగువలకు దూరం ఉండడమే మంచిది.. ఒక భార్యే న్యాయం"

"భలేవారే..అందరూ పెళ్ళి చేసుకొనేది ఒకస్త్రీనే. జస్ట్ ఫర్ వెరైటీ సేక్.. జీవితంలో థ్రిల్ ఉండాలంటే.. వైవిధ్యం ఉండాలి. లేకపోతే నాకు క్షణం తోచదు. అలవాట్లకు బానిసలం కానంతవరకూ అవి మనల్నేమీ చేయలేవు."

"అసలు అలవాటయితేనే కొన్ని ప్రమాదమండోయ్."

మన్మథరావు గొంతు బాగా తగ్గించాడు.

"ప్రమాదాలలోనే ప్రమోదాన్ని చవిచూడాలి..

తరంగాలు

లోకమనెడి కడుపులోన యాహారమై
అరుగుచుండు జఠర వితాగ్ని వైపు
జీవులెదుగుచున్న జీర్ణమై పోవుచే
విశ్వపుష్టి కొఱకు విశ్వం మగుచు.

కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ

నన్ను చూడండి..స్టేషన్ స్టేషన్‌కు ఎందుకు దిగుతున్నానంటారు..హడావుడిగా ఎక్కే ఆడవాళ్ళ మధ్య నుండి..అంతకంటే హడావిడిగా మనం దిగుతుంటే.. వాళ్ళ శరీరాలతో రాపిడి ,చెంది..ఎంత హాయి.. ఆ హాయిని అనుభవించడానికేనండోయ్... నేను ప్రతీ స్టేషన్‌లో దిగేది.."

సరోజ తన చెవులను నమ్మలేకపోయింది.

ఇంతలో స్టేషన్ వచ్చింది.

మన్మథరావు దిగిపోయాడు. మళ్ళీ ట్రైన్ కదిలే సమయానికి ఎక్కాడు. కూచోబోతున్నాడో లేదో.. యింతలో ఎక్కడనుంచో ఒక వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చి మన్మథరావు కాలర్ పట్టుకొని నిలబెట్టాడు.

"రాస్కెల్, ఆ అమ్మాయి ఎవరనుకున్నావురా.. నా భార్య. నా కోసం వాకిలి దగ్గరకొస్తే రాసుకుంటూ వెళ్తావా! మొదటిసారి హడావుడిగా దిగుతున్నావేమో.. పొరపాటున అని అనుకున్నా..రెండుసార్లు..మూడుసార్లు అలా రాసుకుంటూ తిరిగావే..వళ్ళేమయినా తిమ్మిరిగా ఉందా..కంపార్ట్‌మెంట్ ఖాళీగా ఉన్నా మనిషిని తగలకుండా..నువ్వు తిరగలేవురా..స్కౌండ్రల్..కిటికీలోంచి బయటకు తోస్తే ముక్కలు ముక్కలైపోతావు!"

సరోజకు భయం వేస్తోంది.

పురుషోత్తమ్ అడ్డు పడకపోతే అతను అంతపనీ చేసేవాడేమో..

"పోనీండి సార్! ఏదో పొరపాటున తగిలి ఉంటాడు. అంతేగాని కావాలని బుద్ధి ఉన్న వాడెవడూ రాసుకుంటూ వెళ్ళడు సార్..అందులో చదువుకున్నవాడు."

"చదువుకున్న వాళ్ళందరికీ సంస్కారముండొద్దూ.. కొందరు పైకి యిలాగే నీట్‌గా ఉంటారు. మనసులు మాత్రం మురికి గుంటలు. ఇటువంటివాళ్ళకు యిలా కాదు సార్..ఏ కాలో..చేయో..విరిచేస్తే గాని బుద్ధి రాదు."

"పోనివ్వండి సార్..ఈసారికిలా వదిలేయండి. ఇంకొకసారి అలా చేస్తే మీ యిష్టం వచ్చినట్లు చేద్దురు గాని. నామీద దయవుంచి వదిలేయండి."

"ఏదో..మీ మొహం చూచి యీసారికి వదిలేస్తున్నాను. ఊళ్ళో ఆడపిల్లలందరూ వీడి భార్యలైనట్టు.. వెధవ బుద్ధులూ వీడూ..వీడి భార్యను ఎవరైనా అలా చేస్తే..తెలిసొస్తుంది. నీకు ఆఖరి వార్నింగ్ యిస్తున్నా.. మరొక్కసారి ఎవరినైనా అలా ఒరుసుకుంటూ పోయావంటే జాగ్రత్త!"

సరోజ మేథ స్తంభించిపోయింది. ఇంతటి అందమైన శరీరం లోపల అంతటి అనారోగ్యకరమైన హృదయం! ఈసారి ధైర్యంగా మన్మథరావు మొహంలోకి చూస్తోంది. తల దించుకుని ఉన్నాడు. తెల్లగా పాలిపోయి కత్తి వేటుకు నెత్తురుచుక్క లేదు.

కంపార్ట్‌మెంట్ జనం అంతా అక్కడే వున్నారు.. వింత ఏదో జరుగుతున్నట్లు..

"బాబూ..దయచేసి మీ మీ సీట్లకు వెళ్ళిపోండి. ఏమీలేదు- వడ్లగింజలో బియ్యపుగింజ. అయ్యా వెళ్ళిపోండి. అసలే గాలాడడం లేదు. మీరూ వెళ్ళండి మాస్టారూ" అతని కోపాన్ని మంచుగడ్డలా కరిగించేశాడేమో.. మెల్లగా వెళ్ళిపోయాడు. సర్దిచెబుతూ అందరినీ పంపేసి వచ్చి ప్రక్కనే కూచున్నాడు. అలసిపోయి నట్టుంది. కళ్ళు మూసుకున్నాడు.

ఇంతలో మన్మథరావు బాగ్‌తో లేచాడు. సరోజ భర్తను తట్టి లేపింది. వెళ్ళబోతున్న అతన్ని పట్టుకుని—

"చూడండి మన్మథరావుగారూ.. కదిలే ట్రైన్ లోంచి మరో కంపార్ట్‌మెంట్‌లోకి మారాల్సిన అవసరం యిప్పు డేమీ లేదు. అది అంత మంచి పనేమీ కాదు. అదృష్టం బాగోలేకపోతే కాలో..చెయ్యో..విరుగుతుంది. నామాట విని అలా కూచోండి. నేనున్నానుగా..మీకింక భయమేమీ లేదు..కూచోండి" బలవంతాన కూచోబెట్టాడు.

"మీ జీవితంలో యిదొక కటిక చేదు అనుభవం అనుకోండి. మళ్ళీ యిటువంటిది రిపీట్ కాకుండా చూసుకొంటే అదే పదివేలు. పరస్త్రీని కన్నతల్లిగా భావించే సంస్కృతి మనది. పర స్త్రీ ఎదురైతే తల్లిగా భావించి తొలగిపోయేవాడు ప్రహ్లాదుడు. వదినగారి పాదాలు తప్ప మరే భాగమూ చూడనివాడు లక్ష్మణస్వామి. అటువంటి భారతదేశంలో..నాగరికత వెఱ్ఱి తలలు వేసి వ్యామోహాలు విచ్చలవిడిగా వీరవిహారం చేస్తుంటే కేవలం ప్రణయం తప్పితే సహజంగా కనిపించని సినిమాల ప్రభావంలో ఏదయినా తొందరపడితే పరిణామాలు యిలాగే తీవ్రంగా ఉంటాయి. పరస్త్రీని తల్లిగానో, సోదరిగానో చూచే సంస్కారం మనం అలవరచుకొంటే యిన్ని దారుణాలు జరగవు. మీరు దయయుంచి చక్కని ఏ పేద యింటి పిల్లనయినా సరే కన్నె చెర విడిపించండి.భార్య అలనా పాలనలో ఈ లోకాన్నే మర్చిపోవచ్చు. భార్యను భరించవలసిన బాధ్యత ఎంత బరువైనా అంతకంటే ఎంత మధురంగా ఉంటుందో అప్పుడు మీకే తెలుస్తుంది..బై..ది..బై..యిదీ నా అడ్రస్..త్వరలో మీ వెడ్డింగ్ కార్డు పంపిస్తారు కదూ.. అన్నట్లు మేము దిగవలసిన స్టేషన్ వచ్చేస్తోంది..మళ్ళీ.. మనం కలుసుకునేంత వరకూ ఉంటామ మరి!"

సరోజ కళ్ళు చెమ్మగిల్లాయి..

మెల్లగా లగేజ్‌తో దిగబోతున్నాడు భర్త.

"తప్పకోండమ్మా..త్రోవ యివ్వండమ్మా..బండి చాలాసేపు ఆగుతుంది. దిగేవాళ్ళు దిగిన తరువాత.. మీరంతా ఎక్కవచ్చు..ఆడవాళ్ళు తప్పకోండమ్మా.. దారి యివ్వండి".

హెచ్చరికలు చేస్తూ..ఏమాత్రం ఆడవారికి తగలకుండా అతి జాగ్రత్తగా ప్లాట్‌ఫాం మీద అడుగుబెట్టిన భర్త చొక్కా పట్టుకొని ఆపింది సరోజ. అతని దివ్య మంగళ విగ్రహాన్ని ఒక్కసారి తనివితీరా చూడాలనిపించిందేమో!